క్లుప్తంగా

దేవాలయ నిర్మాణానికి సహకారం



నాగరాజును కలిసిన వీరన్నపేట గ్రామస్తులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరన్నపేట గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణం చేపడుతున్నారు. ఈ సందర్భంగా చౌదరిగూడ మండల కేంద్రానికి చెందిన ఆకారం నాగరాజు దేవాలయం నిర్మాణానికి అవసరమైన స్టీలు మొత్తాన్ని విరాళంగా అందిస్తానని హామీ ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు నాగరాజును అభినందించారు.

ఘనంగా బీరప్ప బోనాల ఉత్సవాలు



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

చేవెళ్ల: మండలంలోని రావుపల్లి గ్రామంలో సోమవారం బీరప్ప బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గత రెండు రోజులుగా మల్లన్న బీరప్ప బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. భక్తిశ్రద్ధతో ప్రజలు ఈ బోనాల ఉత్సవాలు నిర్వహించారు. బీరప్ప దేవాలయం వద్ద ఒగ్గు కళాకారులు ఒగ్గు కథలతో అలరించారు. గ్రామంలో బోనాల ఉత్సవాలకు కావాల్సిన ఏర్పాట్లు సర్పంచ్ శ్రీనివాస్, గ్రామ పెద్దలు ఏర్పాటు చేశారు. ఈ బీరప్ప బోనాల ఉత్సవాల్లో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. బీరప్ప దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, పలు పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కొందుర్గు: దివ్యశక్తి పేపర్ పరిశ్రమ ఆధ్వర్యంలో సోమవారం కొందుర్గు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ కావలి యాదయ్య ప్రయాణికులకు నీళ్లు పోసి చలివేంద్రం ఏర్పాటు చేశారు. అనంతరం యాదయ్య మాట్లాడుతూ.. దివ్యశక్తి పేపర్ పరిశ్రమ నిర్వాహకులు ప్రతి సంవత్సరం చలివేంద్రం ఏర్పాటుచేసి తాగునీటిని అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ హెచ్ఆర్ శ్రీనివాసు, పరిశ్రమ ప్రతినిధులు వెంకటేష్, ఉమాకాంత్ పాల్గొన్నారు.

బాలింతలకు పౌష్టికాహారం అందజేత



బాలింతలు, గర్భిణులకు ప్రోటీన్ బాక్స్‌లు అందజేస్తున్న నాయకులు

కేశంపేట: మండల పరిధిలోని లింగంధన గ్రామంలోని బాలింతలు, గర్భిణులకు పాలమూరు చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో పౌష్టికాహారం అందజేశారు. నమో మాతృమూర్తి కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో బాలింతలు, గర్భిణులు ఒక్కొక్కరికి నాలుగు ప్రోటీన్ విటమిన్ బాక్సులను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మొల్ల జయంతి



మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మొయినాబాద్: కవయిత్రి మొల్ల జయంతి వేడుకలను మొయినాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అసైన్డ్ భూమి సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శ్రీనివాస్, కుమ్మరి సంఘం నాయకులు రాంచంద్రయ్య, శంకర్, శ్రీనివాస్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం

మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు షాద్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గాల్లో సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. అన్ని పోలింగ్ కేంద్రాల్లో 144 సెక్షన్‌ను విధించారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో 95శాతం పోలింగ్ జరిగినట్లు ఆర్డీఓ రాజేశ్వరీ తెలిపారు. అలాగే, చేవెళ్లలో 96.51శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల రిటర్నింగ్ సహాయ అధికారి వేణుమాధవ్‌రావు తెలిపారు.

- షాద్‌నగర్‌లో 95శాతం పోలింగ్ నమోదు. చేవెళ్లలో 96.51 శాతం
- పోలింగ్ కేంద్రాలను సందర్శించిన డీసీపీ, ఆర్డీఓ



చేవెళ్ల: ఎన్నికల కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ వేణుమాధవ్‌రావు, తదితరులు



పోలింగ్‌కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి



శంకర్‌పల్లి: ఓటు హక్కును వినియోగించుకున్న యూటీఎఫ్ నాయకుడు రఘునందన్ రెడ్డి

షాద్‌నగర్: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సోమవారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈసందర్భంగా షాద్‌నగర్ నియోజకవర్గంలో 95 శాతం పోలింగ్ జరిగినట్లు ఆర్డీఓ రాజేశ్వరీ తెలిపారు.

నాలుగు కేంద్రాల్లో పోలింగ్

షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు, కేశంపేట, కొందుర్గు, షాద్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో 487 ఓట్లకు గాను 462 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 95శాతం పోలింగ్ నమోదైందని అధికారులు తెలిపారు. కొత్తూరులో 18 ఓట్లకు 18 ఓట్లు, కొందుర్గులో 22 ఓట్లకు గాను 20, కేశంపేటలో 13 ఓట్లకు గాను 12, షాద్‌నగర్‌లో 434 ఓట్లకు గాను 412 ఓట్లు పోలైనట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీసీపీ

షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఆయా పోలింగ్ కేంద్రాలను శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్, ఆర్‌డీఓ రాజేశ్వరీ, తహసీల్దార్ గోపాల్‌లు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను విధించారు.

మందకొడిగా ప్రారంభమై..

ఉదయం 8గంటలకు ప్రారంభమైన పోలింగ్ మందకొడిగా కొనసాగింది. 11గంటల తర్వాత ఎక్కువ మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ కొనసాగింది.

శంకర్‌పల్లిలో 96శాతం పోలింగ్

శంకర్‌పల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు శంకర్‌పల్లిలో ప్రశాంతంగా జరిగాయి. శంకర్‌పల్లి జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఓటింగ్ జరిగింది. మండలంలో 171మంది ఓటర్లకు 165ఓట్లు పోలయ్యాయి. పురుషులు–81, మహిళలు 84మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 96 శాతం ఓటింగ్ నమోదైందని అధికారులు తెలిపారు.

షాబాద్‌లో 100 శాతం పోలింగ్

షాబాద్: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు షాబాద్ మండల పోలింగ్ అధికారి కె.లలిత తెలిపారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్ నిర్వహించారు. ఈ పోలింగ్‌లో 25 మంది పురుషులు, 15 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. షాబాద్ 100 శాతం పోలింగ్ నమోదయిందని ఎన్నికల అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 40 మంది ఓట్లకు గాను 40 ఓట్లు పోల్ అయ్యాయి. కార్యక్రమంలో పోలింగ్ అసిస్టెంట్ అధికారులు పద్మ, శ్రీలత, శ్రీకుమార్, తహసీల్దార్ సైదులుగౌడ్, ఎంపీడీఓ అనురాధ, జూనియర్ అసిస్టెంట్‌రాంబాబు,వీఆర్ఏలు తదితరులున్నారు.

మొయినాబాద్‌లో 79.7 శాతం పోలింగ్

మొయినాబాద్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. మొయినాబాద్‌లో 79.7 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 69 మంది ఓటర్లకు గాను 55 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. ఓటు వేసేందుకు ఉపాధ్యాయులు ఒక్కొక్కరుగా రావడంతో పోలింగ్ నెమ్మదిగా సాగింది. చేవెళ్ల ఆర్డీఓ వేణుమాధవరావు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ హెచ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మండలంలోని పలువురు టీచర్లు ఓటు వేశారు.

ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు

కొత్తూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు మండలంలో సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం పరిధిలో 18 మంది ఓటర్లు ఉండగా అందరు ఓటుహక్కును వినియోగించుకున్నట్లు ప్రిసైడింగ్ అధికారి శరత్‌చంద్రబాబు తెలిపారు. కాగా, పోలింగ్ సరళి ఏర్పాట్లను శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డితో పాటు పలువురు అధికారులు పరిశీలించారు.

చేవెళ్లలో 96.51 శాతం ఓటింగ్

చేవెళ్ల: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 86 ఓట్లు ఉండగా ఇందులో 83 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు చెప్పారు. 52 మంది పురుషులు, 31 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. చేవెళ్లలో 96.51శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను ఎన్నికల రిటర్నింగ్ సహాయ అధికారి వేణుమాధవ్‌రావు, తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, ఎంపీడీఓ రాజ్‌కుమార్, ఎస్ ప్రదీప్, ఆర్ఐ రాజేశ్‌లు పరిశీలించారు.

కార్యకర్త మృతి పార్టీకి తీరనిలోటు

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట: కార్యకర్త మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్త నక్క యాదయ్య సోమవారం మృతి చెందాడు. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యాదయ్య పార్టీకి చేసిన సేవలను గుర్తు చేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నవీన్‌కుమార్, ఎంపీటీసీ మల్లేష్ యాదవ్, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, శ్రీను పాల్గొన్నారు.

‘కంటివెలుగు’తో పేదలకు ప్రయోజనం

ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి

శంకర్‌పల్లి: మండలంలోని ప్రజలు కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని శంకర్‌పల్లి ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గాజులగూడ గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేద ప్రజలకు కంటి వెలుగు పథకం వరం లాంటిదన్నారు. కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరికి ఈ శిబిరంలో పరీక్షలను నిర్వహించి అద్దాలను అందించడం జరుగుతుందన్నారు. సీఎం కేసీఆర్ ప్రజలు కంటి సమస్యలతో ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోవిందమ్మ, గ్రామ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ అనంత్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



లబ్ధిదారుడికి అద్దాలు ఇస్తున్న గోవర్ధన్‌రెడ్డి

దేవాలయ భూముల బహిరంగ వేలం పాట



వేలం పాట నిర్వహిస్తున్న మధుబాబు, ఈఓ శ్రీనివాస్, తదితరులు

షాబాద్: కొమరబండ శ్రీ బుగ్గరామేశ్వరస్వామి దేవాలయ భూములను మూడు సంవత్సరాల పాటు బహిరంగ పాట నిర్వహించినట్లు దేవాదాయ-ధర్మాదాయ శాఖ పరిశీలకులు మధుబాబు, ఈఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని దేవాలయ ఆవరణలో గ్రామ సర్పంచ్ ఏశాల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి 26ఎకరాలు కౌలుకు వేలం పాట నిర్వహించామని తెలిపారు. బొబ్బిలిగామ గ్రామానికి చెందిన ఆవుల కిష్టయ్య, పర్వేద కిష్టయ్య, కొమరబండ గ్రామానికి చెందిన నారమోని వెంకటయ్యలు రూ.1లక్ష 95 వేలకు పాట పాడి భూములను దక్కించుకున్నారు. అలాగే, ఈ సంవత్సరం జాతరకు కొబ్బరికాయలు పూజ సామగ్రి అమ్ముకునేందుకు వేలం పాట నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన పెద్ది బాలయ్య రూ.37 వేల 5వందలకు కైవసం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూముల కౌలు, కొబ్బరికాయల ఆదాయం రూ.2లక్షల 32వేల 5 వందల రూపాయలు వచ్చినట్లు తెలిపారు. ఈనెల 22 నుంచి ఉగాది నుంచి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులున్నారు.

అంధత్వ రహిత సమాజమే లక్ష్యం

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి



కంటి వెలుగును పరిశీలిస్తున్న డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్‌రూరల్: అంధత్వ రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులో గల విద్యుత్ కాలనీలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కంటి వెలుగు శిబిరంలో ప్రతిరోజు 250 మందికి కంటి పరీక్షలు నిర్వహించాలని వైద్యులకు సూచించారు. దగ్గర చూపు లోపం ఉన్న వారికి కంటి అద్దాలను అందజేయాలని, కంటి వెలుగు నిర్వహణలో సమయ పాలన పాటించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. అనంతరం డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ... కంటి సమస్యలను నివారించేందుకు ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరు కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.కంటి వెలుగు కార్యక్రమంపై ఆశవర్కర్లు, వైద్య సిబ్బంది గడప గడపకూ వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రావణి, బీఆర్ఎస్ నాయకుడు జమృద్‌ఖాన్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, డాక్టర్ రమాదేవి, హెల్త్ సూపర్‌వైజర్ రమ, తుకారం, భారతి, అశ్విని, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వాహనదారులు



నిబంధనలకు విరుద్ధంగా చిన్న నంబర్ ప్లేట్‌తో కనిపిస్తున్న కారు

శంకర్‌పల్లి: మండలంలోని దొంతాన్‌పల్లి ఇక్ఫాయి కళాశాలకు చెందిన విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదు. ట్రాఫిక్ పోలీసులు ఎంత కఠినంగా వ్యవహరించినా వారిలో మార్పు రావడం లేదు. కాగా, ఇక్ఫాయి కళాశాలల్లో ధనికులు, ప్రముఖులు, వ్యాపారవేత్తల, రాజకీయ నాయకుల, ఉన్నతస్థాయి అధికారుల పిల్లలు ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారు. దీంతో వారి వాహనాల నంబర్ ప్లేట్ బోర్డులు ఇష్టానుసారంగా ఏర్పాటు చేసుకుంటున్నారు. సోమవారం దొంతాన్‌పల్లి గ్రామ శివారుల్లో ఇక్ఫాయి కళాశాల నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే కారు బోర్డు ముందు భాగం నిబంధనల ప్రకారం ఉంది. వెనుక భాగం నంబర్ ప్లేట్ ఎవరికి కనిపించకుండా అతి చిన్న అక్షరాలతో ఏర్పాటు చేశారు. ఇటీవల కాలంలో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారివి ఫొటోలు తీసి చలానాలు విధిస్తున్నారని.. ట్రాఫిక్ పోలీసులు నిఘా నుంచి తప్పించుకునేందుకే ఇటువంటి బోర్డును ఏర్పాటు చేసుకున్నారని పలువురు భావిస్తున్నారు. గత కొంత కాలంగా శంకర్‌పల్లి–హైదరాబాద్ రోడ్డులో ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. ఇటీవల విద్యార్థులు కారు రేసింగ్ చేసి జనవాడ గ్రామానికి చెందిన ఓ మహిళ ప్రాణాన్ని బలిగొన్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

దేవాలయ హుండీ లెక్కింపు

హుండీ ఆదాయం రూ.1,61,340

చేవెళ్ల: మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయం హుండీ లెక్కింపు కార్యక్రమం సోమవారం ఆలయంలో దేవాదాయశాఖ అధికారులు, ఆలయ పూజారులు, గ్రామస్తుల సమక్షంలో నిర్వహించారు. శివరాత్రి జాతర సందర్భంగా భక్తులు వేసిన హుండీ ఆదాయం లెక్కించారు. రూ.1,61,340 వచ్చినట్లు దేవాదాయశాఖ అధికారి మధుబాబు, శ్రీనివాస్‌లు తెలిపారు. హుండీ ఆదాయాన్ని దేవాలయం పేరుపై ఉన్న బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ ఆదాయం దేవాలయ అభివృద్ధికి దేవాదాయశాఖ ద్వారా వినియోగించడం జరుగుతుందని చెప్పారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజ, ఆలయ పూజారులు రాఘవేంద్రచారి, శ్రీకాంత్, శ్రీపాదు, భక్తులు పాల్గొన్నారు.


కరాటేలో విద్యార్థులకు బంగారు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులు

షాద్‌నగర్: హైదరాబాద్‌లోని చంపాపేట బాలాజీ గార్డెన్‌లో సోమవారం తెలంగాణ ఓపెన్ రాష్ట్రస్థాయి మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో షాద్‌నగర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభను కనబర్చి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కరాటేలోని స్పైరింగ్ విభాగంలో నందిని, స్నేహ, వైష్ణవి, సంధ్య, కటాస్ విభాగంలో యం.వైష్ణవి, జి.వైష్ణవి, మానస, భాగ్యశ్రీలు ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు సాధించారు. అదేవిధంగా భార్గవి, తేజస్విని, లావణ్యలు సిల్వర్ పతకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ శివకృష్ణగౌడ్ తెలిపారు. విద్యార్థులను పాఠశాల హెచ్ఎం శివకుమారి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

మార్షల్‌ఆర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ



రాణించిన విద్యార్థులతో నిర్వాహకులు

కొత్తూరు: మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ కనబర్చారని మార్షల్‌ఆర్ట్స్ శిక్షకుడు శివకుమార్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థినీ, విద్యార్థులు ఈ నెల 12న హైదరాబాద్‌లోని చంపాపేట బాలాజీ గార్డెన్‌లో నిర్వహించిన తెలంగాణ ఓపెన్ స్టేట్‌లెవల్ మార్షల్‌ఆర్ట్స్‌లో పాల్గొని స్పైరింగ్, కటాస్‌తో పాటు పలు విభాగాల్లో రాణించారని తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు టోర్నమెంట్ నిర్వాహకులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో రాణించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారని తెలిపారు.

నేడు కేంద్ర బృందం పర్యటన

కడ్తాల్: కడ్తాల్ గ్రామ పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించేందుకు జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ బృందం ప్రతినిధులు మంగళవారం కడ్తాల్‌లో పర్యటించనున్నారని గ్రామ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ(ఎన్ఐఆర్‌డీపీఆర్), సుపరిపాలన కేంద్రం, విశ్లేషణవిధానం(సీజీజీపీఏ), మానవ వనరుల నిర్వహణ కేంద్రం(సీహెచ్‌ఆర్‌డీ) ఆధ్వర్యంలో జిల్లాలోని రాజేంద్రనగర్‌లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల నిర్వహణ అంశంపై మూడురోజుల శిక్షణ తరగతుల్లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పరిశీలన నిర్వహణ తీరుతెన్నులను పరిశీలించేందుకు కడ్తాల్ గ్రామంలో పర్యటించనున్నారని తెలిపారు.

సేవా దృక్పథంతో ముందుకు..

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్‌రూరల్: మానవ సేవే మాధవ సేవని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో సర్పంచ్ మాధవిరామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్‌ఇన్ నీడ్(ఎఫ్‌సీఎన్) సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీతాథామస్‌రెడ్డి సహకారంతో వృద్ధులకు దుప్పట్లు, దుస్తులు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దుప్పట్లు, డిక్షనరీలను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ...ప్రతిఒక్కరు సేవాదృక్పథం అలవర్చుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. సేవాభావంతో నిరుపేదలకు తమవంతు సహాయ సహకారాలను అందించాలని తెలిపారు. పేదలు, అనాథలు, వృద్ధులకు మనవంతు సేవ చేయాలనే ఆలోచనతో ఎఫ్‌సీఎన్ సంస్థ ముందుకు రావడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ఎంపీటీసీ భీష్వరామకృష్ణ, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, వార్డు సభ్యులు బుగ్గమ్మనర్సింలు, రషీదాషరీఫ్, బాలమ్మ, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్ష్మయ్య, నాయకులు. తదితరులు పాల్గొన్నారు.

మతం మారిన క్రైస్తవుల వివరాలు తెలపాలి

మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి రాజేందర్‌సింగ్



తహసీల్దార్‌కు దరఖాస్తు పత్రం అందజేస్తున్న రాజేందర్‌సింగ్

శంకర్‌పల్లి: క్రైస్తవ మతంలోకి మారి ఎస్సీ కులస్తులమని చెప్పుకోవడం తగదని మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి రాజేందర్ సింగ్ ఆరోపించారు. సోమవారం శంకర్‌పల్లి తహసీల్దార్ నయిముద్దీన్‌కు మండలంలోని జనవాడ గ్రామంలో క్రైస్తవ మతంలోకి మారిన వారి వివరాలను ఇవ్వాలని బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఆర్టీఏ యాక్టు కింద దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రైస్తవ మతంలోకి మారిన వారు బీసీ–సీ సర్టిఫికెట్ తీసుకోకుండా రాజ్యాంగ విరుద్ధంగా ఎస్సీలమని చెప్పుకుంటూ.. ఎస్సీ సామాజిక వర్గానికి అందాల్సిన ప్రభుత్వ పథకాలను కాజేస్తున్నారని మండిపడ్డారు. జనవాడ గ్రామంలో చర్చీల నిర్మాణానికి అనుమతులు తీసుకున్నారా.. చర్చీల నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాలు ఏ ప్రాతిపదికన కేటాయించారో తెలపాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు నర్సింహారెడ్డి, రాజేష్‌గౌడ్, లోకేష్ పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప బ్రహ్మోత్సవాలు



బీరప్ప ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్: మండల పరిధిలోని చిలుకూరులో బీరప్పస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం బీరప్పస్వామి బోనాల ఊరేగింపు నిర్వహించారు. డోలు తాళాల చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో బోనాల ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం బీరప్ప, కామరాతి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్, టీపీసీసీ సభ్యుడు రాచమల్ల సిద్దేశ్వర్, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, మాజీ సర్పంచ్ సంగెరి మల్లేష్, ఉపసర్పంచ్ సుధాకర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్‌లు ఆంద్రూ, నర్సింహ్మాగౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మహేందర్, నాయకులు జయవంత్, శ్రీరాములు, గరుగు రాజు, కురుమసంఘం నాయకులు నరేందర్, రమేష్, బీరప్ప, శ్రీశైలం, రాజు, శ్రీకాంత్, సురేందర్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్‌కు మాతృవియోగం

షాద్‌నగర్‌టౌన్: షాద్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎంఎస్ నటరాజన్ మాతృమూర్తి శకుంతలదేవి (85) మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యానికి గురైన ఆమె సోమవారం ఉదయం ఇంట్లోనే తుదిశ్వాస విడిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, బక్కని నర్సింలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మిత్రులు పెద్ద ఎత్తు నటరాజ్ స్వగృహానికి వెళ్లి శకుంతలదేవి భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.